

రక్తం పంచి.. ఆయువు పెంచి

రక్తదానం మహాదానం. ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ఆదుకున్న వారే ప్రాణ బంధువులు.

వివరాలు 8లో ▸



7,500 కోళ్లు మృత్యువాత

శివ్వంపేట మండల పరిధిలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పెద్ద కూలి కోళ్లు మృత్యువాతపడ్డాయి.

వివరాలు 8లో ▸



వానాకాలం.. దాహం దాహం!

వానాకాలంలో ప్రజలు తాగునీటి సమస్యతో సతమతం అవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వీరికి శాపంగా మారింది.

వివరాలు 9లో ▸

బుంగ.. రైతుకు బెంగ

మరమ్మతులకు నోచుకోని నీటి వనరులు

మెదక్‌జోన్: గతేడాది వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని పలు చెరువు, కుంటలకు బుంగలు పడ్డాయి. వీటిలో కొన్ని తెగిపోయాయి. అధికారులు అప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. మళ్లీ వర్షాలు కురిస్తే తెగిపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతినే అవకాశం ఉంది.

16 చెరువు, కుంటలకు గండి

జిల్లావ్యాప్తంగా గతేడాది కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. 16 చెరువులు, కుంటల్లో కొన్ని బుంగలు పడగా, మరికొన్ని తెగిపోయాయి. అప్పట్లో వాటికి ఇసుక సంచులతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఈ వేసవిలో శాశ్వత మరమ్మతులు చేయాల్సిన అధికారులు అటు వైపు తొంగి చూడలేదు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా 4 లక్షల ఎకరాలకు పైగా సాగు భూములు ఉండగా.. 1400కు పైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. వర్షం నీటికి ఇవి నిండడంతో వాటి ఆయకట్టు కింద ఉన్న భూముల్లో రైతులు నాట్లు వేస్తారు. అయితే దెబ్బతిన్న చెరువులు, కుంటల వెనక వందలాది ఎకరాల్లో సాగు భూములు ఉన్నాయి. వీటికి మరమ్మతులు చేయకపోవడంతో నీరంతా వృథాగా పోయి పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది.

ఆందోళనలో అన్నదాతలు

దెబ్బతిన్న చెరువులు, కుంటలకు మరమ్మతులు చేయకుండా ఎన్నికల కోడ్ అడ్డువచ్చిందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కాలువల పూడిక తీత సైతం తీయకపోవడంతో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. అనేక చెరువులకు సంబంధించి తూములు శిథిలావస్థకు చేరాయి. వానాకాలం సీజన్ ప్రారంభమైన అధికారులు అటువైపు చూడకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా దెబ్బతిన్న చెరువులు, కుంటలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. ఇదే విషయమై మెదక్ ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రావును వివరణ కోరగా గతేడాది కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 16 చెరువులు, కుంటలు దెబ్బతిన్నాయని, వీటికి అప్పట్లోనే తాత్కాలిక మరమ్మతులు చేయించామని తెలిపారు. శాశ్వత మరమ్మతులు చేద్దామంటే ఎన్నికల కోడ్ అడ్డువచ్చిందన్నారు. గతంలోనే ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామని, నిధులు మంజూరు కాగానే పనులు చేయిస్తామని పేర్కొన్నారు.



కొల్చారం: సంగాయిపేట పెద్ద చెరువు తూమును పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాస్

త్వరితగతిన మరమ్మతులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట పెద్ద చెరువు తూము మరమ్మతులు త్వరితగతిన చేపడుతామని నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్ తెలిపారు. రెండేళ్ల క్రితం తూముకు ఇరువైపులా బుంగలు పడి నీరంతా వృథాగా పోవడంతో సాగునీటికి ఇబ్బందిగా మారింది. ఇదే విషయం బుధవారం గ్రామంలో బడిబాటకు వచ్చిన కలెక్టర్ రాహుల్‌రాజ్ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాలతో ఈఈ గురువారం చెరువును సందర్శించారు. మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు అందించాలని డీఈ నాగరత్నం, ఏఈ మహేశ్‌ను ఆదేశించారు. 15 రోజుల్లోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, రైతులు ఆగంగౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఏఓ గోవిందు

టేక్మాల్(మెదక్): రైతులు సేంద్రియ ఎరువులు వాడుతూ పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి పొందుతారని జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు తెలిపారు. గురువారం టేక్మాల్‌లోని గ్రోమోర్, ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయించవద్దని ఆదేశించారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు రశీదును ఖచ్చితంగా తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎరువులు, విత్తన కొరత లేదన్నారు. పూర్తిస్థాయిలో వర్షాలు పడిన తర్వాతనే విత్తనాలు విత్తుకోవాలన్నారు. సాగు విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఇందులో మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు ఆహ్వానం

నర్సాపూర్: మెదక్, నర్సాపూర్‌లోని మైనార్టీ పాఠశాల, కాలేజీల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జెంలానాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నర్సాపూర్ మైనార్టీ పాఠశాల, కాలేజీలో ఉర్దూ, ఇంగ్లిష్, సోషల్, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులు బోధించేందుకు ఉపాధ్యాయులు కావాలన్నారు. వివరాలకు 7673917990 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

రేగోడ్(మెదక్): బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రతిరోజు బడిబాట కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు సుశీల, అంజిబాబు, ఉపాధ్యాయులు ప్రతాప్, అశోక్, సంజీవులు, శివాని, శివకుమార్, నవీన్ కుమార్, చంద్రశేఖర్, జూనియర్ సహాయకులు రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

మెదక్ కలెక్టరేట్: కనీస వేతనం లేకుండా ఆశావర్కర్లతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటుందని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ మండిపడ్డారు. ఇటీవల ప్రభుత్వం ఆశావర్కర్లకు పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించడాన్ని నిరసిస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏఎన్‌ఎంలు చేయాల్సిన పనులు కూడా అధికారులు ఆశాలతో చేయిస్తున్నారని ఆరోపించారు. గతంలో చదువు రాని వారిని సైతం విధుల్లోకి తీసుకున్నారని, ఇప్పుడు పరీక్షలు రాయమంటే వారు ఎలా రాస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5 నెలలు గడుస్తున్నా, ఇచ్చిన హామీలు పరిష్కరించడం లేదని వాపోయారు.

రైస్‌మిల్లులపై విజిలెన్స్ దాడులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు రైస్‌మిల్లులపై గురువారం సాయంత్రం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. గోమారంలోని సత్యసాయి, దొంతిలోని శ్రీమాత ట్రేడింగ్ కంపెనీ రైస్‌మిల్లులపై దాడులు నిర్వహించి స్టాక్ వివరాలు సేకరించారు. ప్రభుత్వం ఇచ్చిన వడ్లతో పాటు రైస్‌మిల్లులు ఎఫ్‌సీఐకి ఇచ్చిన బియ్యంపై ఆరా తీసినట్లు తెలిసింది. అనంతరం ధాన్యం నిల్వలతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. తనిఖీ చేసిన రెండు రైస్‌మిల్లుల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని సమాచారం.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

- బడిబాటలో కలెక్టర్ రాహుల్‌రాజ్
- విద్య, వైద్యానికి పెద్దపీట: ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం పెద్దశంకరంపేట, వీరోజిపల్లిలో నిర్వహించిన బడిబాటలో పాల్గొని మాట్లాడారు. బడిబాటలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించి, బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. అనంతరం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్య, వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. డ్రాపౌట్ లేకుండా చూడాలని, గత ప్రభుత్వ హయాంలో 6 వేల బడులు మూతపడ్డాయని గుర్తుచేశారు. వాటిని తెరిచి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. టీచర్స్ రిక్రూట్‌మెంట్ చేపట్టి ఈ ప్రాంతంలో ఉపాధ్యాయుల కొరత తీరుస్తామని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీల్లో పౌష్టికాహారంతో పాటు బోధనపై సైతం దృష్టి పెట్టాలని సూచించారు.

అసలు హీరోలు వారే..

బాహుబలి సినిమా హీరో ఎవరని కలెక్టర్ విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థులు ప్రభాస్ అని సమాధానం ఇవ్వగా.. రూ.200 కోట్లతో కంప్యూటర్ ఇంజినీర్లు గ్రాఫిక్ డిజైన్ చేశారని, తెరవెనుక హీరోలు వారేనని అన్నారు. చదువుకుంటేనే వారు ఈస్థాయిలో ఉన్నారని తెలిపారు. అనంతరం మిషన్ భగీరథ సర్వే యాప్‌ను పరిశీలించారు. లబ్ధిదారుడి వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి నల్లా ఫొటోను అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, ఎంఈఓ బుచ్చానాయక్, ఎంపీపీ జంగం శ్రీనివాస్, తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా, హెచ్‌ఎంలు వెంకటేశం, విఠల్, శ్రీనివాస్, రామచంద్రాచారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

మెదక్ కలెక్టరేట్: బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రజలను కోరారు. గురువారం కలెక్టరేట్‌లో 'సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాల్టీ టు ఎనిమల్స్' ఆధ్వర్యంలో అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా పశు వైద్యాధికారి విజయశేఖర్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పోలీస్ అధికారులు ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించి జంతువుల చట్టాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో తూప్రాన్ టోల్‌గేట్, నర్సాపూర్ చౌరస్తా, కోలపల్లి చెక్‌పోస్టుల వద్ద పోలీసు, వెటర్నరీ, రవాణా శాఖ అధికారులతో సమీకృత చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో కుక్కల, కోతుల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మెదక్‌లో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను త్వరలో ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్‌కు చెప్పారు.

లోపం ఎక్కడ?

- జహీరాబాద్‌లో ఓటమిపై నడ్డా అసంతృప్తి
- గెలిచే స్థానాన్ని చేజార్చుకున్నామంటూ ఆవేదన

జహీరాబాద్: జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ కోల్పోవడంపై పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈనెల 8న ఢిల్లీలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన పార్టీ ముఖ్యనేతలతో సమావేశమై ఎన్నికల ఫలితాల తీరును ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధానంగా జహీరాబాద్ పార్లమెంట్ స్థానం గురించి చర్చకు వచ్చినట్లు తెలిసింది. రాష్ట్రంలో 10 స్థానాలను గెలుస్తామనుకుంటే 8 స్థానాలకే పరిమితం కావడం, గెలిచే జాబితాలో ఉన్న జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కోల్పోవడంపై పార్టీ నేతల వద్ద నడ్డా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.

జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని గెలుస్తున్నట్లు అన్ని సర్వేలు వెల్లడించాయని, గతంలో మెదక్ పార్లమెంట్ పరిధిలో ఉన్నప్పుడు ఎంపీ స్థానాన్ని గెలుపొందిన విషయం సైతం ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. గతంలో మెదక్ పార్లమెంట్ కింద ఉన్న జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి అసెంబ్లీ స్థానాలు ప్రస్తుతం జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్నందున సునాయసంగా గెలిచే అవకాశం ఉన్నట్లు అధిష్టానవర్గం భావించింది. ఓటమికి లోపం ఎక్కడ జరిగిందనే విషయమై ఆరా తీసినట్లు సమాచారం. జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ 46వేల ఓట్ల తేడాతో కోల్పోయింది. ఒక్క జహీరాబాద్ అసెంబ్లీ స్థానంలోనే కాంగ్రెస్ పార్టీ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌పై 35 వేల ఓట్ల ఆధిక్యతను సాధించింది. కాంగ్రెస్ పార్టీకి ఇంత మేర ఆధిక్యత రావడమే బీజేపీ ఓటమికి ప్రధాన కారణమైందనే చర్చ పార్టీలో సాగుతోంది.

త్వరలో సమీక్ష!

జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఓడిపోవడానికి గల కారణాలపై త్వరలోనే సమీక్ష నిర్వహించాలని పార్టీ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. జహీరాబాద్ కేంద్రంగా సమావేశం నిర్వహించే అవకాశం ఉన్నట్లు, సమావేశంలో కింది స్థాయి కార్యకర్తలను సైతం ఆహ్వానించే అవకాశం ఉన్నట్లు తెలిపాయి. ఈసందర్భంగా నిర్వహించే సమీక్షలో పార్టీలో నెలకొన్న అసంతృప్తి బహిర్గతం కానుందనే ప్రచారం సాగుతోంది.

వైద్య సేవలు మెరుగుపరుస్తాం

- ఆస్పత్రులన్నీ అభివృద్ధి చేస్తాం
- మంత్రి దామోదర రాజనర్సింహ



మంత్రి దామోదరకు విన్నవిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

దుబ్బాక: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తామని, ఆ దిశగా ఆస్పత్రులన్నీ అభివృద్ధి చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మంత్రి రాజనర్సింహను సచివాలయంలో కలిశారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ వైద్య సేవల మెరుగుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత, సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు చెరుకు విజయ్‌రెడ్డి, మచ్చ శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మెదక్ అభివృద్ధి బాధ్యత నాదే



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

- ఈ విజయం కార్యకర్తలకు అంకితం
- ఎంపీ రఘునందన్‌రావు

మెదక్‌జోన్: మెదక్ అభివృద్ధి బాధ్యత తనదేనని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. గురువారం మెదక్ పట్టణంలోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో పాల్గొని మాట్లాడారు. ఈ విజయం బూత్‌లెవల్ బాధ్యులతో పాటు బీజేపీ కార్యకర్తలకే అంకితమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తల గెలుపునకు కృషి చేస్తానని, నాతో ఎవరు పోటీ పడతారో సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గత ప్రభుత్వం మెదక్ నుంచి అథ్లెటిక్ క్రీడాకారులను హైదరాబాద్ పంపించిందని, జిల్లా కేంద్రంలో రూ.కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన అథ్లెటిక్ స్టేడియం వృథాగా మారిందన్నారు. అలాగే చేగుంట–మెదక్ ప్రధాన రహదారిపై రైల్వేగేట్ ఉందని, రైలు వస్తే గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయన్నారు. అక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కావాలన్నారు. అక్కన్నపేట, చేగుంటలో అజంత, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లు ఆగేలా చూస్తానన్నారు. రైల్వేస్టేషన్లలో రేక్‌పాయింట్ల నిర్మాణాలు వంద శాతం చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు కరణం పరిణీత, పంజా విజయ్‌కుమార్, నందారెడ్డి, సత్యనారాయణ, ప్రసాద్ ఎంఎల్‌ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఫలితాలు మోదీకి చెంపపెట్టు

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్: లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మోదీకి చెంపపెట్టులాంటివని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. హుస్నాబాద్‌లోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల కాలంలో విచ్చలవిడిగా, ఏకపక్షంగా పాలించిన మోదీకి ఇప్పుడు జాగ్రత్త పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వ తప్పులను నిలదీసి, ప్రజల పక్షాన గళం విప్పాలన్నారు. వామపక్షాలు బలహీన పడటానికి కారణాలు ఏమిటో అంతర్మథనం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ నియంతృత్వానికి చెక్ పెట్టి రేవంత్‌రెడ్డికి అధికారం కట్టబెట్టారని తెలిపారు. పరిపాలనలో మార్పు రావాలని రేవంత్‌రెడ్డిపై ప్రజలు, మేధావులు ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మాదిరిగా రేవంత్ రెడ్డి రోజు ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం కాలేదన్నారు. ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత మంత్రి పొన్నంపై ఉందన్నారు. సర్వే నంబర్ ఆధారంగా సమగ్ర భూ సర్వే చేసే వరకు భూ సమస్యలు పరిష్కారం కావని చాడ అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మల్లేశ్, సత్యనారాయణ, వనేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల శంకర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జనార్దన్, నాయకులు ఉన్నారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

సంగారెడ్డి టౌన్: ఓపెన్ స్కూల్ ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ ఫలితాలు విడుదలైనట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. జిల్లాలో ఓపెన్ స్కూల్ ద్వారా 2,181 మంది పదోతరగతి పరీక్షలు రాయగా, 1,736 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. అలాగే ఇంటర్‌లో 4,022 మంది పరీక్షలు రాయగా 2,696 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మెదక్ జిల్లాలో పదో తరగతిలో 458 మంది పరీక్షలు రాయగా 357మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్‌లో 881 మంది పరీక్షలకు హాజరు కాగా 530 మంది ఉత్తీర్ణులయ్యారు. సిద్దిపేట జిల్లాలో పదోతరగతిలో 769మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 328 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియెట్‌లో 1,057మంది పరీక్షలకు హాజరుకాగా 393 మంది ఉత్తీర్ణులైనారని ఆయన వెల్లడించారు.

నేటి నుంచి ధరణి స్పెషల్ డ్రైవ్

- జిల్లాలో 6,617 దరఖాస్తులు పెండింగ్
- రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేశాం
- 'సాక్షి'తో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మెదక్ కలెక్టరేట్: జిల్లాలో నేటి నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ప్రభుత్వం ధరణి సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. మార్చిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టినప్పటికీ పార్లమెంట్ ఎన్నికలు రావడంతో మధ్యలోనే నిలిపివేశామన్నారు. నేటి నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టి పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 6,617 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో మ్యుటేషన్, పహాణిలో పేరు మార్పు, ఇంటి పేరు, జెండర్, తదితర సమస్యలతో పాటు కోర్టు కేసులు కలిపి 15 రకాల సమస్యలు ఉన్నాయని వివరించారు.

త్వరితగతిన పరిష్కారం

గతంలో ధరణి సమస్యలపై ఫిర్యాదు చేస్తే నేరుగా కలెక్టర్ వద్దకు వచ్చేవని, అవి పరిశీలించి పరిష్కరించే వరకు ఆలస్యమయ్యేదని తెలిపారు. ప్రభుత్వం ధరణిలోని కొన్ని సమస్యలు ఆర్డీఓ, తహసీల్దార్లు పరిష్కరించే విధంగా ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీంతో సమస్యల పరిష్కారం వేగవంతమైనట్లు చెప్పారు. పహాణిలో పేరు మార్పు, ఇంటి పేరు, జెండర్ వంటి చిన్న చిన్న సమస్యల పరిష్కారాన్ని తహసీల్దార్లకు అప్పగించామన్నారు. కోర్టు కేసులు, నాలా కన్వర్షన్, కొత్త పాస్‌బుక్‌ల జారీ వంటి వాటిని ఆర్డీఓలకు అప్పగించినట్లు వివరించారు. దీంతో సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నట్లు స్పష్టం చేశారు.

మీసేవ ద్వారా దరఖాస్తుల స్వీకరణ

జిల్లాలోని రైతులు భూ సమస్యలపై మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ దరఖాస్తులు నేరుగా ఆన్‌లైన్ ద్వారా తమ దృష్టికి వస్తాయని తెలిపారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు.

నేటి సాయంత్రంలోగా మొత్తం డబ్బులు

యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో పూర్తిగా జమ చేసినట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 68,600 మంది రైతుల నుంచి 2,84,153 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే 95 శాతం ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో వేశామన్నారు. అయితే కొంత ధాన్యాన్ని గద్వాల్, సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాలకు తరలించినట్లు చెప్పారు. దీంతో ఆ ధాన్యానికి సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ ఐకేపీ ఆధ్వర్యంలో చేపట్టగా ఆలస్యం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి రూ.34 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఆ ప్రక్రియ కొనసాగుతుందని, శుక్రవారం సాయంత్రంలోగా పూర్తి డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని వివరించారు.

క్లుప్తంగా

దివ్యాంగుడి అభిమానం

సీఎం చిత్రం గీసి బహూకరణ



సీఎం రేవంత్‌రెడ్డికి చిత్రపటం బహూకరిస్తున్న ఆగమప్ప సోదరులు

నారాయణఖేడ్‌: సిర్గాపూర్‌ మండలం కడ్పల్‌ గ్రామానికి చెందిన గూడూరి ఆగమప్ప మూగ, చెవిటి లోపం ఉంది. అయినా చిత్ర కళలలో ప్రావీణ్యతను సాధించాడు. పెన్సిల్‌ చిత్రాలను గీయడంలో దిట్ట. సీఎం రేవంత్‌రెడ్డి తన మనుమడిని ఎత్తుకున్న చిత్రాన్ని పెన్సిల్‌తో గీసి గురువారం సోదరులైన నాగరాజు, ఆగమప్ప జహీరాబాద్‌ ఎంపీ సురేష్‌ షెట్కార్‌, టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్‌తో కలిసి హైదరాబాద్‌లోని సీఎం నివాసానికి వెళ్లి ఆయనకు చిత్రపటాన్ని బహూకరించారు. పేదరికంతోపాటు మూగ, చెవిటితో ఉన్నందున ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని సీఎంను కోరారు.

టిప్పర్‌ దగ్ధం

హుస్నాబాద్‌రూరల్‌: హుస్నాబాద్‌ మండలం జిల్లెలగడ్డ దగ్గర గురువారం ప్రమాద వశాత్తు టిప్పర్‌ దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం పోతారం(ఎస్‌)కు చెందిన టిప్పర్‌ హుస్నాబాద్‌ ఇటుక బట్టీలకు మట్టి తరలిస్తుంది. టిప్పర్‌ ఓవర్‌ లోడుతో ఇంజన్‌లో వైర్లు కాలిపోయి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఎండ తీవ్రతకు మంటలు ఎగిసిపడటంతో డ్రైవర్‌ మేల్కొని ఫైర్‌ సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలార్పివేశారు. అప్పటికే టిప్పర్‌ కాలిపోయింది. ఎంవీఐ అధికారులు కండిషన్‌ లేని వాహనాలను రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.

తల్లిని చంపిన కొడుకు అరెస్టు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆస్తి కోసం కన్న తల్లిని కొట్టి చంపిన కొడుకును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చిన్నకోడూరు మండలం గంగాపూర్‌ గ్రామానికి చెందిన అంతగిరి మల్లయ్యకు సత్తవ్వ, పోశవ్వ ఇద్దరు భార్యలు. సత్తవ్వ కుమారుడు చంద్రశేఖర్‌ సత్తవ్వ పేరున ఉన్న ఐదు ఎకరాల భూమి తన పేరు మీదకు చేయాలని కొంత కాలంగా గొడవ జరుగుతుంది. మంగళవారం రాత్రి తల్లి సత్తవ్వ ఇంటికి వెళ్లి భూమి విషయమై గొడవపడ్డాడు. వినకపోవడంతో బైక్‌పై ఎక్కించుకొని సిద్దిపేటకు వెళ్తూ రంగనాయక సాగర్‌ వద్ద బైక్‌ ఆపి మరోసారి తల్లితో గొడవ పడ్డాడు. ససేమిరా అనడంతో బైక్‌ హాండిల్‌కు తల్లి తలను గట్టిగా బాధాడు. బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని బైక్‌పై పెట్టుకొని ఇంటికి వెళ్లాడు. ఇంటి వెనుకాల వేసి కాలుజారి పడి గాయాలైనట్లు చిత్రీకరించాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారించగా జరిగిన విషయం వెల్లడించాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సీఐ శ్రీను, ఎస్‌ఐ బాలకృష్ణలు ఉన్నారు.

7,500 కోళ్లు మృత్యువాత



కూలిపోయిన కోళ్ల ఫామ్‌

శివ్వంపేట(నర్సాపూర్‌): మండల పరిధి లింగోజిగూడతో పాటు రూప్ల తండాలో గురువారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో లింగోజిగూడకు చెందిన లక్ష్మణ్‌ కోళ్ల ఫామ్‌ పై కప్పు షెడ్డు కూలిపోయి 6 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. మరో వ్యక్తి శ్రీనివాస్‌కు చెందిన కోళ్ల ఫామ్‌ షెడ్డు కూలిపోయి 1,500 కోళ్లు చనిపోయాయి. సుమారు రూ.17 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. రైతు రమేశ్‌కు చెందిన పశువుల పాక షెడ్డు కూలిపోయి అందులోని గేదెలకు గాయాలయ్యాయి. రూప్ల తండాలో భిక్షపతి, కిషన్‌, చెన్యాలకు చెందిన నివాసగృహాలపై కప్పు రేకులు పూర్తిగా తొలగిపోయి ఇళ్లలోని సామగ్రి తడిసిపోయాయి. దీంతో నిలువ నీడ లేకుండా పోయిందని బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు.

రక్తం పంచి.. ఆయువు పెంచి

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

ఆపదలో ఆదుకుంటున్న రక్తదాతలు

- రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న పోలీసులు, యువత
- సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్‌ బ్యాంక్‌లో ప్రత్యేక క్యాంపు



సిద్దిపేటకమాన్‌: రక్తదానం మహాదానం. ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ఆదుకున్న వారు ప్రాణ బంధువులే. ఏ బంధం లేకున్నా మానవీయ కోణంలో స్పందించే తీరు ఐక్యతను చాటుతుంది. ప్రమాదమో, శస్త్ర చికిత్సనో, ఏదైతేనేం ఆపద సమయంలో రక్తదానం చేసి ఆదుకున్న వారు ఆప్తులకు మించిన వారు. రక్తం అవసరం ఉందనే విషయం వాట్సాప్‌, వివిధ రకాల సోషల్‌ మీడియా ద్వారా తెలుసుకుని జిల్లా పోలీసులు, యువత స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు జూన్‌ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్‌ బ్యాంక్‌లో ప్రత్యేకంగా క్యాంపులను ఏర్పాటు చేసి రక్తదానంపై అవగాహన కల్పించనున్నారు.

సిద్దిపేట ప్రభుత్వ మెడికల్‌ కళాశాల అనుబంధ జనరల్‌ ఆస్పత్రిలోని బ్లడ్‌ బ్యాంక్‌ ద్వారా రక్తాన్ని సేకరించి, నిల్వ ఉంచి అవసరమైన వారికి అందజేస్తున్నారు. ప్రతి నెలా ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసి రక్తాన్ని సేకరిస్తూ బ్లడ్‌ బ్యాంక్‌లో నిల్వ ఉంచుతున్నారు. ఇటీవలె మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా పట్టణంలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి 99 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. బ్లడ్‌ బ్యాంక్‌ ద్వారా ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 1,330 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు బ్లడ్‌ బ్యాంక్‌ అధికారులు చెబుతున్నారు. అదే విధంగా ఎవరైనా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వారికి రక్తం అవసరం ఉందనే విషయాన్ని ప్రత్యేంగా ఏర్పాటు చేసుకున్న వాట్సాప్‌ గ్రూప్‌ల ద్వారా విషయం తెలుసుకుంటున్న జిల్లా పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లు, యువత వెంటనే స్పందించి బ్లడ్‌ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

70 సార్లు రక్తదానం



రక్తదానం చేస్తున్న ప్రశాంత్‌

వర్గల్‌(గజ్వేల్‌): వర్గల్‌ మండలం శాకారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు వరాల ప్రశాంత్‌ విరివిగా రక్తదానాలతో ఎందరినో ప్రాణాపాయం నుంచి గట్టెక్కించాడు. సిద్దిపేట పట్టణం స్వస్థలం. అతనిది బీ-పాజిటివ్‌ బ్లడ్‌ గ్రూప్‌. 1995లో డిగ్రీ విద్యార్థిగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ రక్తదాన శిబిరంలో తొలిసారి రక్తదానం చేశాడు. అదే స్ఫూర్తిగా లయన్స్‌ క్లబ్బులు, వాసవీ క్లబ్బులు, ఇతర స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన అనేక శిబిరాలలో రక్తదానం చేశాడు. శిబిరాలకే పరిమితం కాకుండా ఆపదలో ఉన్న మరెందరికో ఆయా ఆసుపత్రులకు వెళ్లి నేరుగా రక్తదానం చేశాడు. ఈ 48 ఏళ్ల ఉపాధ్యాయుడు నాటి నుంచి నేటి వరకు అర్ధసెంచరీ దాటేసి 70 సార్లు రక్తదానం చేశాడు. రెండుసార్లు ప్లేట్‌లెట్లు దానం చేశాడు. మాజీ మంత్రి హరీశ్‌రావు తదితర ప్రముఖుల సన్మానాలు, ఎన్నెన్నో ప్రశంసాపత్రాలు, ఎందరివో ప్రశంసలు, అవార్డులు పొంది నేటి తరానికి స్ఫూర్తి నింపుతూ సెంచరీ వైపు సాగుతున్నాడు.

ప్రాణదాతలమవుదాం



అత్యవసర పరిస్థితుల్లో, ప్రమాదాల్లో తీవ్ర గాయాలైన వారికి మనం చేసే రక్తదానం వారి ప్రాణాలను కాపాడుతుంది. రక్తదానం చాలా విలువైనది, వెలకట్టలేము. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణదాతలమవుదాం. ఆరోగ్యవంతమైన ప్రతి ఒక్కరూ వైద్యుల సలహాలు, సూచనతో రక్తదానం చేయవచ్చు.

– డాక్టర్‌ అరుణాచందర్‌, గైనకాలజిస్టు

22 సార్లు రక్తదానం చేశా..



ఎవరైనా ఆపదలో ఉన్నారని, అత్యవసరంగా రక్తం అవసరం ఉందనే విషయం తెలిసిన వెంటనే బ్లడ్‌ బ్యాంక్‌కు వెళ్లి రక్త దానం చేస్తాను. ఇప్పటి వరకు 22 సార్లు రక్తదానం చేశాను. నా తోటి స్నేహితులను కూడా రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తాను. ఆరోగ్యవంతమైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి. రక్తదానం అనేది వెలకట్టలేనిది.

– నరేశ్‌, సిద్దిపేట త్రీటౌన్‌ కానిస్టేబుల్‌

ఇద్దరు పిల్లలతో చెరువులో దూకిన తల్లి

- తల్లి, కూతురిని కాపాడిన అమీన్‌పూర్‌ పోలీసులు
- అప్పటికే నీటమునిగి బాలుడు మృతి
- అమీన్‌పూర్‌ మున్సిపాలిటీలో ఘటన



తల్లి, కూతురిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్‌: పిల్లలను చూసుకునే విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య ఇద్దరు పిల్లలతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌ మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. అమీన్‌పూర్‌ సీఐ నాగరాజు కథనం మేరకు.. రంగారెడ్డి జిల్లా చందానగర్‌లో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్‌ దంపతులకు పిల్లలను చూసుకునే విషయంలో ఇటీవలె గొడవ జరిగింది. బుధవారం భర్త విద్యాధర్‌ రెడ్డి స్వగ్రామమైన వరంగల్‌ వెళ్లాడు. భార్య శ్వేత గురువారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో తన ఇద్దరు కవల పిల్లలు శ్రీయాన్స్‌ (3), శ్రీహలను స్కూటీపై తీసుకొని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌ పెద్ద చెరువు వద్దకు వచ్చింది. పిల్లలతో సహా చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న అమీన్‌పూర్‌ పెట్రోలింగ్‌ పోలీసులు పెద్ద చప్పుడు రావడంతో చెరువు వద్దకు వెళ్లి చూశారు. అప్పటికే దూకిన శ్వేత చెరువులో కొట్టుకుంటూ కనిపించింది. వెంటనే హెడ్‌ కానిస్టేబుల్‌ జానకీ రామ్‌ చెరువులో దూకి మరో హెడ్‌ కానిస్టేబుల్‌ ప్రభాకర్‌ సాయంతో తల్లి శ్వేత, కూతురు శ్రీహను బయటికి తీశారు. కానీ అప్పటికే మూడేళ్ల బాలుడు శ్రీయాన్స్‌ నీటిలో మునిగి చనిపోయాడు. తల్లి, కూతురును చందానగర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. బాలుడి మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన శ్రీయాన్స్‌

హత్యాయత్నం కేసులో..

పలువురు నిందితుల అరెస్ట్‌

సిద్దిపేటకమాన్‌: హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో పోలీసులు గురువారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్‌ సీఐ లక్ష్మీబాబు, ఎస్‌ఐ నర్సింహరావుతో కలిసి ఏసీపీ మధు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన గరికముక్క రాజేశ్‌ పట్టణానికి చెందిన అనిత వద్ద రాఘవేంద్రనగర్‌ కాలనీలో స్థలాన్ని కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్‌, మరికొంత మంది వ్యక్తులతో కలిసి స్థలం తమదేనంటూ రాజేశ్‌, మరో ఇద్దరు సతీష్‌, శ్రీనివాస్‌రెడ్డిలపై దాడి చేశారు. బాధితుడు రాజేశ్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌తో పాటు మరో 9 మందిపై వన్‌ టౌన్‌ పోలీసులు హత్యాయత్నం, అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఇందులో వల్లెపు పర్శరాములు, అలకుంట ఆనంద్‌, బొల్లవేణ యాదగిరి, దూది శ్రీకాంత్‌రెడ్డి, పత్రి శ్రీనివాస్‌, పాతూరి శ్రీనివాస్‌రెడ్డి, శివరాత్రి నగేశ్‌, చేర్యాల అభిషేక్‌లను అరెస్ట్‌ చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఉరి వేసుకొని ఇద్దరు ఆత్మహత్య

నారాయణఖేడ్‌: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వెంకటాపూర్‌ శివారులో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. అల్లాదుర్గం మండలం ముస్లాపూర్‌ గ్రామానికి చెందిన సుంగూర్‌ పోచయ్య(45) వెంకటాపూర్‌కు చెందిన నిర్మలను వివాహం చేసుకున్నాడు. పోచయ్యకు మానసికస్థితి సక్రమంగా లేకపోవడంతో భార్య పిల్లలతో కలిసి హైదరాబాద్‌ వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. గురువారం ఉదయం వెంకటాపూర్‌ శివారులో పోచయ్య చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడి భార్య నిర్మల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా మృతుడికి సంబంధించిన చేతి సంచిలో కల్లు ప్యాకెట్‌ ఉండడంతో అతిగా కల్లు తాగిన మత్తులో ఆత్మహత్య చేసుకోవచ్చని గ్రామస్తులు, భార్య అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మతిస్థిమితం లేని యువకుడు..

జోగిపేట (అందోల్‌): ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఎస్సై అరుణ్‌ కుమార్‌ గౌడ్‌ కథనం మేరకు.. జోగిపేట పట్టణానికి చెందిన మల్లేశం (30) శివాజీ నగర్‌లో నివాసముంటున్నాడు. కుటుంబ సభ్యులు నర్సాపూర్‌ ప్రాంతంలో జీవనోపాధి పొందుతున్నారు. మూడు రోజుల కిందట జోగిపేటలోని ఇంటికొచ్చి దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో పక్కన ఉన్న వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తాళం పగులగొట్టి చూడగా దూలానికి వేలాడుతూ కనిపించాడు. మతి స్థిమితం లేని కారణంగానే కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లుగా కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్‌ గౌడ్‌ తెలిపారు.



మల్లేశం (ఫైల్‌)

ఆయిల్‌పామ్‌ సాగు లాభదాయకం

జిల్లా ఇన్‌చార్జి అధికారి శంకర్‌



మాట్లాడుతున్న అధికారి శంకర్‌

అక్కన్నపేట(హుస్నాబాద్‌): ఆయిల్‌పామ్‌ సాగు లాభదాయకమని ఆయిల్‌పామ్‌ జిల్లా ఇన్‌చార్జి అధికారి శంకర్‌ అన్నారు. వ్యవసాయ విస్తరణాధికారి శ్రీలత అధ్యక్షతన మండలంలోని జనగామ గ్రామానికి చెందిన వడియాల ప్రభాకర్‌ ఆయిల్‌పామ్‌ తోటలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి శంకర్‌ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క రైతు ఆయిల్‌పామ్‌ సాగు చేసుకొని అధిక దిగుబడులు పొందాలని సూచించారు. సాధారణ పంటల సాగు కంటే ఈ పంట లాభదాయకంగా ఉంటుందన్నారు. పంట సాగుకు అనుకూలమైన పరిస్థితులు, దిగుబడి వచ్చే విధానం, దిగుబడిని అమ్ముకునే విధానం, మార్కెటింగ్‌ సౌకర్యం, మొక్కకు ఇవ్వాలిన పోషకాలు, ఎరువులు, యాజమాన్య పద్ధతులు, పామ్‌ గెలలు కోసే విధానం గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు, ఆయిల్‌ ఫెడ్‌ ఫీల్డ్‌ ఆఫీసర్‌ రవళి, డ్రిప్‌ కంపెనీ అధికారి భరత్‌, గ్రామ మాజీ సర్పంచ్‌ బొడ్డు ఈశ్వర్‌, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మార్నింగ్‌ వాక్‌కు వెళ్లి వస్తుండగా..

- మహిళపై దాడి చేసి బంగారు ఆభరణాలు చోరీ
- ఇద్దరు దొంగలు అరెస్ట్‌
- వివరాలు వెల్లడించిన గజ్వేల్‌ ఏసీపీ పురుషోత్తంరెడ్డి



నిందితులను చూపుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

ములుగు(గజ్వేల్‌): మార్నింగ్‌ వాక్‌కు వెళ్లి వస్తున్న మహిళపై దాడి చేసి బంగారు అభరణాలు ఎత్తుకెళ్లిన దొంగలను పోలీసులు అరెస్ట్‌ చేశారు. గురువారం ములుగు పోలీస్‌ స్టేషన్‌లో గజ్వేల్‌ ఏసీపీ పురుషోత్తంరెడ్డి వివరాలు వెల్లడించారు. ములుగు మండలం తున్కిబొల్లారం గ్రామానికి చెందిన శ్యామల శంకరమ్మ(54) రోజు మాదిరిగానే మంగళవారం ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీ మామిడ్యాల నుంచి వంటిమామిడి వైపు మార్నింగ్‌ వాక్‌కు వెళ్లి తిరిగి వస్తుంది. తున్కిబొల్లారం గ్రామ శివారులోని గోల్డ్‌ స్టోన్‌ అకాడమీ స్కూల్‌ సమీపంలోకి రాగానే ఇద్దరు గుర్తు తెలియని దొంగలు ఆటోలో వచ్చి ఆమెపై సుత్తితో దాడి చేశారు. ఆమె మెడలోని నాలుగున్నర తులాల బంగారు పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. గజ్వేల్‌ రూరల్‌ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ సిబ్బందితో కలసి గజ్వేల్‌ ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచనలకు అనుగుణంగా బోర్డర్‌ పోలీస్‌ స్టేషన్‌లకు సమాచారం అందించారు. దొంగలు అభరణాలను బుధవారం తూప్రాన్‌ పట్టణంలో గల జ్యూవెలరీ షాపులో అమ్మే ప్రయత్నం చేయగా షాపు యజమాని అనుమానంతో పోలీసులకు సమాచారమిచ్చాడు. తూప్రాన్‌ పోలీసులు వారిని పట్టుకొని ములుగు పోలీసులకు అప్పగించారు. నిందితులు దుండిగల్‌ మండలం నాగలూర్‌కు చెందిన నింగని రజనీకాంత్‌(23) అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్‌ ఇరగళ్ల యాదగిరి (36)గా గుర్తించారు. నిందితుల నుంచి దొంగిలించిన నాలుగున్నర తులాల బంగారు పుస్తెల తాడు, ఫోన్లు, ఆటో స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ తెలిపారు.

డీజిల్‌ చోరీ నిందితుల అరెస్ట్‌

వివరాలు వెల్లడించిన గజ్వేల్‌ సీఐ సైదా



వివరాలను వెల్లడిస్తున్న సీఐ సైదా

గజ్వేల్‌రూరల్‌: డీజిల్‌ దొంగతనానికి పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేసినట్లు గజ్వేల్‌ సీఐ సైదా తెలిపారు. గురువారం గజ్వేల్‌ పోలీస్‌స్టేషన్‌లో అదనపు సీఐ ముత్యంరాజుతో కలిసి వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని కోమటి బండ వద్ద ఈనెల 11న వాహనాల తనిఖీ చేస్తుండగా ఇన్నోవా క్రిస్ట అనుమానాస్పదంగా కనిపించిందన్నారు. తనిఖీ చేయగా రెండు డీజిల్‌ క్యాన్లతో పాటు ఓ పైపు లభించాయన్నారు. అనంతరం వారిని విచారించగా గతంలో చేసిన నేరాలు ఒప్పుకున్నట్లు తెలిపారు. వనపర్తి జిల్లా పెద్ద మందడి మండలం, గట్టు ఘనపూర్‌ గ్రామంలోని గోర్మిల తండాకు చెందిన కేతావత్‌ శ్రీనుతోపాటు అంగోత్‌ తిరుపతి, అంగోత్‌ రాజ్‌కుమార్‌, సభవతి రమేశ్‌, దేవేందర్‌ సింగ్‌, ముడవత్‌ సురేందర్‌, ముడవత్‌ బాధ్య జల్సాలకు అలవాటు పడి, ఓ కారును అద్దెకు తీసుకొని రెండు నెలలుగా పెట్రోల్‌ బంక్‌లు, వాటి సమీప ప్రాంతాల్లో నిలిపి ఉన్న లారీలు, ఇతర వాహనాల నుంచి డీజిల్‌ దొంగతనం చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. దొంగతనం చేసిన డిజిల్‌ను కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లికి చెందిన మహ్మద్‌ షరీఫ్‌, మహ్మద్‌ జహీర్‌లకు విక్రయించినట్లు గుర్తించామన్నారు. డీజిల్‌ చోరీకి పాల్పడిన కేతావత్‌ శ్రీనుతోపాటు డీజిల్‌ను కొనుగోలు చేసిన మహ్మద్‌ షరీఫ్‌, మహ్మద్‌ జహీర్‌లను అదుపులోకి తీసుకొని జ్యుడీషియల్‌ రిమాండ్‌కు పంపించామన్నారు. మిగతా వారు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ సైదా, అదనపు సీఐ ముత్యంరాజు, పోలీసు సిబ్బంది రవి, వెంకటేశ్‌, నరేశ్‌, నరేందర్‌, సంతోష్‌లను గజ్వేల్‌ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రాజయ్య మృతదేహం

రామాయంపేట(మెదక్‌): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన రామాయంపేట మండలం తొనిగండ్లవద్ద గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్‌ కథనం మేరకు.. హవేళిఘనపూర్‌ మండలం శమ్నాపూర్‌ గ్రామానికి చెందిన చాకలి రాజయ్య (50), స్నేహితుడు కాసుల రాములుతో కలిసి బైక్‌పై రామాయంపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మెదక్‌ నుంచి రామాయంపేటకు వస్తున్న కారు మార్గమధ్యలో వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన కాసుల రాములును చికిత్స నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించారు. ఎస్‌ఐ రంజిత్‌ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

అల్లాదుర్గం(మెదక్‌): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి అల్లాదుర్గం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని చిల్వెర గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌ రెడ్డి కథనం మేరకు.. చిల్వెర గ్రామానికి చెందిన తమ్మలి ప్రభాకర్‌(60) ఎస్‌వీఆర్‌ డాబాలో పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి పని ముగించుకొని చిల్వెర గ్రామానికి వెళ్తున్నాడు. 161 రహదారి దాటి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బావిలో పడి వ్యక్తి..



మోష(ఫైల్‌)

జహీరాబాద్‌ టౌన్‌: కోహీర్‌ పట్టణం లాలాకుంట నివాసి పర్తుగారి మోష (50) బావిలో పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. ఈ నెల 10 తేదీన మేకకు మేత కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. గురువారం సాయంత్రం గ్రామ శివారులోని బాబమియ వ్యవసాయ బావిలో శవమై తేలాడన్నారు. మేత కోసం చెట్టు కొమ్మలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి ఉంటాడని భావిస్తున్నారు. భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

బాబోయ్‌.. హైటెన్షన్‌

- ప్రమాదకరంగా సిద్దిపేట–దుబ్బాక మెయిన్‌ లైన్‌ డీపీ స్తంభాలు
- ఒరిగిపోయి ఇనుప చువ్వలు తేలిన వైనం
- పొలాలకు వెళ్లాలంటే జంకుతున్న రైతులు
- కొత్త స్తంభాలు వేయాలని వినతి



అప్పనపల్లి శివారులో ఒంగిపోయిన విద్యుత్‌ స్తంభాలు, తేలిన ఇనుపచువ్వలు

దుబ్బాక: ఎప్పుడో 50 ఏళ్ల కిందట వేసిన విద్యుత్‌ మెయిన్‌ లైన్‌ డీపీ స్తంభాలు గాలివానకు విరిగిపోయి ఇనుపచువ్వల తేలి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కూలుతాయో తెలియక రైతులు భయాందోళనకు గురవుతున్నారు. సిద్దిపేట నుంచి దుబ్బాక వయా కామారెడ్డి జిల్లా దోమకొండ వరకు 33 కేవీ విద్యుత్‌ విద్యుత్‌ మెయిన్‌ లైన్‌ను ఉండగా ఏడాది కిందట గాలివానకు విరిగిపోయి పూర్తిగా ఒంగిపోయింది. ప్రమాదం జరిగి తమ ప్రాణాలు పోయాక పట్టించుకుంటారా అంటూ దుబ్బాక మండలం అప్పనపల్లి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మెయిన్‌ లైన్‌ ద్వారానే దుబ్బాకతో పాటు కామారెడ్డి జిల్లా దోమకొండ మండలాల్లోని చాలా విద్యుత్‌ సబ్‌స్టేషన్‌లకు విద్యుత్‌ సరఫరా అవుతుంది. స్తంభాలు విరిగిపోయి పూర్తిగా పక్కకు వంగిపోయి ఎప్పుడు కిందపడిపోతాయో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

పొలాలకు వెళ్లాలంటేనే భయం..

విద్యుత్‌ మెయిన్‌ లైన్‌ స్తంభాలు విరిగిపోవడంతో ఆ ప్రాంతం నుంచి పొలాల వద్దకు వెళ్లాలంటే రైతులు జంకుతున్నారు. ఈవిషయం అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. డీపీ స్తంభాలు ఉన్న రైతు సాయిలు పంట వేసుకునేందుకు పొలం దున్నాలంటేనే భయపడుతున్నాడు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌ స్తంభాలు తొలగించి కొత్త వాటిని వేసి ప్రాణాలు కాపాడాలంటూ అప్పనపల్లి రైతులు అధికారులను కోరుతున్నారు.

పొలం దున్నలేకపోతున్నాం..



కరెంట్‌ మెయిన్‌లైన్‌ స్తంభాలు నా పొలంలోనే విరిగిపోయి ఉన్నాయి. దీంతో పొలం దున్నాలంటేనే భయంగా ఉంది. పొలం సాగు చేయకుండా అట్లానే ఉంచుతున్నా. ఏడాది నుంచి కరెంటోళ్లకు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. మా పొలంలో పనికి భయంతో కూలీలు కూడా వస్తలేరు. అధికారులు చర్యలు తీసుకొని తమ ప్రాణాలు కాపాడాలే.

– వీరబోయిన సాయిలు, రైతు అప్పనపల్లి

కొత్త స్తంభాలు వేయాలి



మెయిన్‌లైన్‌ స్తంభాలు విరిగిపోయి పూర్తిగా ఒంగిపోయి ఇనుప సలాకల మీదనే ఉండడంతో ఎప్పుడు కూలుతాయో తెలియడం లేదు. ఏడాది నుంచి మా పొలాలకు వెళ్లాలంటనే రైతులు భయపడుతుండ్రు. విద్యుత్‌ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని విరిగిన స్తంభాలు తొలగించి కొత్త స్తంభాలు వేయాలి.

–చాంద్‌,రైతు అప్పనపల్లి

చర్యలు తీసుకుంటాం



అప్పనపల్లి శివారులో సిద్దిపేట–దుబ్బాక–దోమకొండ వెళ్లే విద్యుత్‌ మెయిన్‌ లైన్‌లో డీపీ స్తంభాలు విరిగిపోయిన వాటిని రెండు రోజుల్లో తొలగించి కొత్త స్తంభాలు వేయిస్తాం. రైతులకు ఏం ప్రమాదం జరుగకుండా వెంటనే చర్యలు తీసుకుంటాం. విద్యుత్‌ లైన్‌లో అంతరాయ లేకుండా చూస్తాం. రైతులు ఆందోళన చెందొద్దు

–మోహన్‌రెడ్డి, ఎస్‌ఈ సిద్దిపేట